## క్లుప్తంగా

### బంగారుకొండ కిట్లు పంపిణీ



సమిశ్రగూడెంలో దాతలకు బంగారుకొండ కిట్లు అందిస్తున్న అధికారులు

నిడదవోలు రూరల్: చిన్నారుల్లో పౌష్టికాహార లోపాలను నివారించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు దాతల సహకారంతో బంగారుకొండ కిట్లు అందిస్తున్నామని తహసీల్దార్ ఎం.గంగరాజు అన్నారు. ఈ కార్యక్రమం అమలుపై సోమవారం సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, దాతలతో అధికారులు సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పి.సామ్యేలు మాట్లాడుతూ ఐసీడీఎస్ ప్రాజెక్ట పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 205 మంది చిన్నారులను పౌష్టికాహార లోపంతో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ చిన్నారులకు దాతల సహకారంతో ఈనెల 20న ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో బంగారుకొండ కిట్లు అందజేస్తామన్నారు. ఈ సెక్టార్ సూపర్‌వైజర్ పి.నళిని, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి

తాళ్లపూడి: బంగారుకొండ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి జాన సత్యనారాయణ సూచించారు. డీపీవోగా బాధ్యతలు చేపట్టాక సోమవారం తొలిసారిగా ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి మొదటి సారిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారం అందజేసే బంగారు కొండ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్డీ వీరన్న, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, రామలక్ష్మి, హేమంతి, తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే తలారి దృష్టికి టీచర్ల సమస్యలు

దేవరపల్లి: పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు సోమవారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావును దేవరపల్లిలో కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఫ్యాప్టో నాయకత్వంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని వారు ఎమ్మెల్యేకు అందజేశారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఉపాధ్యాయులపై అవలంబిస్తున్న వైఖరిని నిరోధించాలని, జీవో నంబరు 117ను రద్దు చేయాలని, రెగ్యులర్ ప్రాతిపదికన ప్రమోషన్లు ఇవ్వాలని, పూర్తిస్థాయిలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని ఆ వినతిపత్రంలో వారు కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఉస్సే శంకరుడు, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషబ్రహ్మం, యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షులు కేపీ బిందు, ప్రధాన కార్యదర్శి బి. నాగేంద్రప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శివారు ప్రాంతాలకూ తాగు నీరందిస్తాం



భూమి పూజ చేసిన చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: పట్టణ శివారు ప్రాంతాలకు సమృద్ధిగా తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన భూపతి ఆదినారాయణ అన్నారు. 21వ వార్డులోని హెడ్ వాటర్ వర్క్స్ ప్రాంగణంలో మున్సిపల్ సాధారణ, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.8.69 లక్షల వ్యయంతో నిర్మించే పబ్లిక్ హెల్త్ వాహనాల నిలుపుదల షెడ్డు, మంచినీటి బోర్ నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బారాజు, కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, గోపిరెడ్డి శ్రీనివాస్, తోలేటి సత్యనారాయణ, కృపానందం , దాకే అనిల్, ఆరుగొళ్ళు వెంకటేశ్వరరావు, కొత్తూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

నిడదవోలు: నిరాదరణకు గురవుతున్న దివ్యాంగులను మానవత్వంతో ఆదుకోవడం అభినందనీయమని జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ర్యాలి సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చెక్కా నూకరాజు జ్ఞాపకార్థం ఆయన మనువడు చెక్కా రాజేష్ ఆర్థిక సహకారంతో సోమవారం 20 దివ్యాంగుల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వంగా కృప, విక్టాస్ వర్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పేదల గృహాలకు పచ్చజెండా

- జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలకు శ్రీకారం
- శంకుస్థాపన చేస్తే అడ్వాన్స్‌గా రూ.20 వేలు
- 110 లే అవుట్లలో 11,058 గృహాల మంజూరు
- దేవరపల్లిలో సందర్శించిన ఎమ్మెల్యే తలారి



దేవరపల్లిలోని జగనన్న లేఅవుట్‌ను సోమవారం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, అధికారులు

దేవరపల్లి: పేదల సొంతింటి కల నెరవేరబోతోంది. గోపాలపురం నియోజకవర్గంలోని జగనన్న లేఅవుట్లలో రెండో విడత గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చి రెండేళ్లు అయింది. కరోనా వల్ల గృహాల నిర్మాణంలో జాప్యం జరిగింది. తొలి విడతలో అర్బన్ ప్రాంతాల్లో మాత్రమే ప్రభుత్వం గృహాల నిర్మాణం చేపట్టింది. దాంతో గోపాలపురం నియోజకవర్గానికి గృహాలు మంజూరు కాలేదు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విజ్ఞప్తి మేరకు రెండో విడతలో నియోజకవర్గానికి 11,058 గృహాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో 109 లేఅవుట్లలో గృహాల నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు లేఅవుట్లను సదర్శించి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, సర్పంచ్ కడిమి వీరకుమారి గృహ నిర్మాణశాఖ డీఈఈ టి.శేఖర్‌బాబు, తహసీల్దార్ ఎం.రామకృష్ణలు సోమవారం దేవరపల్లిలోని జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. వారి అభ్యర్థన మేరకు గృహ నిర్మాణాలకు వీలుగా లేఅవుట్లలో మౌలిక వసతులు కల్పించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు అధికారులను ఆదేశించారు.

**దేవరపల్లిలో 37 ఎకరాల్లో ..**

జిల్లాలోనే అతిపెద్ద కాలనీ నిర్మాణం దేవరపల్లి లేఅవుట్‌లో జరగబోతోంది. ఇందుకోసం గుండుగొలను–కొవ్వూరు జాతీయ రహదారిని అనుకుని రెండు విడతల్లో అధికారులు 37 ఎకరాల భూమిని సేకరించి లేఅవుట్ చేశారు. ఇక్కడ తొలివిడతలో 1095 మంది పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు పంపిణీ చేశారు. రెండో విడతలో మరొక 500 మందికి స్థలాలు పంపిణీ చేస్తారు.

**నియోజకవర్గానికి మంజూరైన గృహాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి**

| మండలం | లే అవుట్లు | మంజూరైన గృహాలు |
|---|---|---|
| దేవరపల్లి | 34 | 2944 |
| గోపాలపురం | 37 | 1149 |
| నల్లజర్ల | 38 | 2016 |
| ద్వారకాతిరుమల | 1 | 1200 |
| మొత్తం | 110 | 7309 |

**4,749 మంది లబ్ధిదారులకు ఎంజాయ్ మెంట్లు**

సొంత స్థలం ఉండి ఇళ్లు లేని పేదలు నియోజకవర్గంలో 4,749 మంది ఉన్నట్టు సర్వే ద్వారా అధికారులు గుర్తించారు. వారందరికీ ఎంజాయ్‌మెంట్ పత్రాలు అందించారు. నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా)లో విలీనం చేయడంతో రెండో విడతలో ప్రభుత్వం గృహాలను మంజూరు చేసింది. కాగా ప్రధాన మంత్రి అవాస్ యోజనలో మంజూరైన 3437 గృహాలు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి.

**పేదల సొంతింటి కల నెరవేరుస్తాం**



నియోజకవర్గంలో 7309 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. ఇల్లులేని ప్రతి పేదోడికీ ఇల్లు మంజూరు చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం. నియోజకవర్గంలో 20 వేల మందికి ఇళ్లు కట్టించాలన్నది నా లక్ష్యం. ఇప్పటికీ ఇంటి స్థలం లేని వారు దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లో మంజూరు చేస్తాం. జగనన్న లేఅవుట్లలో మౌలిక వసతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సొంత స్థలం ఉన్న పేదలకు కూడా గృహాలు మంజూరు చేస్తాం. ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఉచితంగా అందజేస్తుంది. లబ్ధిదారులే ఇంటి నిర్మాణం చేసుకోవాలి.

– తలారి వెంకట్రావు, ఎమ్మెల్యే, గోపాలపురం

**లేఅవుట్లలో మౌలిక వసతులు**



జగనన్న లే అవుట్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నాం. బోర్లు వేసి మోటార్లు ఏర్పాటు చేస్తున్నాం. నల్లజర్ల మండలం పోతవరంలో రెండు లే అవుట్లలో 350 గృహాల నిర్మాణం జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 109 లేఅవుట్లలో 6109 గృహాల నిర్మాణానికికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటిలో 80 మంది పురుష, 6029 మంది మహిళా లబ్ధిదారులు ఉన్నారు. ఎస్సీలు 2293 మంది, ఎస్టీలు 165 మంది, ఓబీసీలు 2365 మంది, జనరల్ కేటగిరీ లబ్ధిదారులు 1286 మంది ఉన్నారు. లబ్ధిదారులు గృహనిర్మాణం ప్రారంభిస్తే రూ.20 వేలు అడ్వాన్సుగా చెల్లిస్తాం. ఇసుక ఉచితంగా సరఫరా చేస్తాం. సిమెంట్, ఇనుము ప్రభుత్వ ధరకు సరఫరా చేస్తాం.

– టి. శేఖర్‌బాబు, డీఈఈ, గృహనిర్మాణ శాఖ

**సొంతింటి కల నెరవేరుతోంది**



సొంతింటి కల నెరవేరబోతోంది. 20 ఏళ్లుగా అద్దె ఇంటిలో ఉంటున్నాం. సీఎం జగనన్న రుణం తీర్చుకోలేం.మాకు ఇల్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది. ఎంతో మంది పేద అక్కచెల్లెమ్మల సొంత ఇంటి కల సాకారం అవుతుంది. ప్రభుత్వం ఇస్తున్న సొమ్ముకు కొంత కలిపి ఇల్లు నిర్మించుకుంటాం.

– నక్కా వెంకటలక్ష్మి, లబ్ధిదారు, దేవరపల్లి

## వంతెన నిర్మాణ పనుల పరిశీలన



దేవరపల్లిలో ఇసుక వాగుపై నిర్మిస్తున్న వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: దేవరపల్లిలోని ఇసుక వాగుపై శ్రీవారి ఆలయం వద్ద నిర్మాణంలో ఉన్న వంతెనను సోమవారం గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలించారు. ఇసుక వాగు అభివృద్ధి, వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.10 కోట్లు మంజూరు చేయగా, గత నెలలో ఎమ్మెల్యే తలారి ఆ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ మొత్తంలో రూ.30 లక్షలు వంతెన నిర్మాణానికి కేటాయించారు.వారం రోజులుగా వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నందున ఎమ్మెల్యే వెంకట్రావు పరిశీలించి, నాణ్యంగా పనులు చేయాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం వస్తే వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని, నిర్మాణ పనులు వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్ధనారావు, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, పార్టీ నాయకులు మేడిబోయిన గంగరాజు, మాధవరపు వెంకటేశ్వరరావు, వెలగా శ్రీనివాస్, కడిమి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతోంది.. పంటలు ఎండుతున్నాయి



పెద్దేవంలో కాలిపోయిన ఎస్ఎస్-2 ట్రాన్స్ ఫార్మర్

తాళ్లపూడి: తరచూ ట్రాన్స్‌ఫార్మర్ పాడవుతుండడంతో విద్యుత్తు సరఫరా నిలిచిపోయి వేసవిలో తమ పంటలకు నీరు అందడం లేదని మండలంలోని పెద్దేవం గ్రామ రైతులు వాపోతున్నారు. మలకపల్లి సబ్ స్టేషన్ ఎస్ఎస్-2 ట్రాన్స్‌ఫార్మర్‌పై ఆధారపడి (ఈ ట్రాన్స్ ఫార్మర్ పెద్దేవం పొలాల్లో ఉంటుంది) పెద్దేవం రైతులకు 18 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. రైతులు బోర్ల నీటి సాయంతో వేసవిలో ఆకుకూరలు, కూరగాయలు వంటి పంటలను సాగు చేసుకుంటున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ తరచూ కాలిపోతోందని, దాంతో తమ పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. తమకు విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ సీహెచ్ వెంకటరావు మాట్లాడుతూ రైతుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని గతంలో ట్రాన్స్ ఫార్మర్‌ను మార్చే ప్రయత్నం చేశామని తెలిపారు. ఇప్పుడు అత్యవసర చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

## దేవరపల్లి రెండో ఎంఈఓగా అప్పారావు



కేఆర్ఎస్‌వీవీ అప్పారావు

దేవరపల్లి: మండల విద్యాశాఖాధికారి-2గా కేఆర్ఎస్‌వీవీ అప్పారావు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గోపాలపురం మండలం కొవ్వూరుపాడులో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతిపై దేవరపల్లి ఎంఈఓ-2గా బదిలీపై వచ్చారు. మండలంలోని పలువురు ఉపాధ్యాయులు అప్పారావును మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.

**తాళ్లపూడికి నెహ్రూజీ..**

తాళ్లపూడి: మండల రెండో ఎంఈవోగా గజ్జరం జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెరుకూరి నెహ్రూజీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రధానోపాధ్యాయుడిగానే కాకుండా రెండో ఎంఈవోగా కూడా బాధ్యతలు నిర్వహిస్తారు. ఆయనను ఎంఈవో వై .సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభినందించారు.

**నిడదవోలుకు గురుమూర్తి**

నిడదవోలు రూరల్: నిడదవోలు ఎంఈఓ-2గా పి.గురుమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పనిచేసిన గురుమూర్తి ఎంఈఓగా పదోన్నతి పొందారు. ఇకపై విద్యా వ్యవస్థలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, పాఠశాలలను ఎంఈఓ-2 పర్యవేక్షించనున్నారు. గురుమూర్తిని ఎంఈఓ కిషోర్‌కుమార్, సీఆర్పీలు అభినందించారు.



తాళ్లపూడి మండల రెండో ఎంఈవో నెహ్రూజీని అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

**ఉండ్రాజవరానికి శారదా జ్యోత్స్న**

ఉండ్రాజవరం: ఎంఈఓ-2 గా డి.శారదా జ్యోత్స్న సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2022-2023 విద్యా సంవత్సరంలో ఆమె నాలుగు నెలల పాటు ఇన్‌చార్జ్ ఎంఈవోగా ఉండ్రాజవరంలో పనిచేశారు. ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర మండల ఎంఈవోగా విధులు నిర్వహిస్తున్న ఆమె ఉండ్రాజవరం మండల విద్యాశాఖాధికారి-2గా బదిలీపై వచ్చారు.

## ఆణిముత్యాలకు పురస్కారాలు



ఖండవల్లి ఉన్నత పాఠశాల్లో జగనన్న ఆణిముత్యాలుతో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్



ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలెం ఉన్నత పాఠశాల్లో ..

పెరవలి: ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానాల్లో నిలిచిన మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల విద్యార్థులను సోమవారం ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన జగనన్న ఆణిముత్యాలు పథకం ద్వారా ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున మొత్తం 21 మంది మెరిట్ విద్యార్థులకు నగదు పురస్కారాలు,ప్రశంసాపత్రాలు అందజేశారు. పెరవలి, ఖండవల్లి, ముక్కామల ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమాల్లో గండేపల్లి రామకృష్ణ, వేంద్ర శ్రీను, కేతా త్రిమూర్తులు, రేలంగి ఏసు, ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, విద్యా కమిటీ చైర్మన్లు, పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని సూర్యారావుపాలెం హైస్కూల్లో సోమవారం జగనన్న అణిముత్యాలుగా ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి చేతుల మీదుగా నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. అనంతరం ఆ పాఠశాల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆమె పరిశీలించారు. సర్పంచ్ ఎం .లలితకుమారితో కలసి ఎంపీపీ వంటకాలను రుచి చూశారు. పాఠశాల హెచ్ఎం గెడ్డం పోలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణంలోని నంబర్- 3 మున్సిపల్ హైస్కూల్ నుంచి జగనన్న ఆణిముత్యాలుగా ఎంపికైన ముగ్గురు మెరిట్ విద్యార్థులను కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణ చేతుల మీదుగా సత్కరించారు. 2022-23లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలో మంచి మార్కులు సాధించిన శెట్టి దుర్గ అవినాష్ (560), మహ్మద్ ఫరీద్ (551), టి.వెంకట శివ చైతన్య (532)లకు కౌన్సిలర్ నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు స్వీకరించారు. హెచ్ఎం సత్తి శ్రీరామరెడ్డి, విద్యా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చాగల్లు: బ్రాహ్మణగూడెం జెడ్పీ హైస్కూల్లో జగనన్న అణిముత్యాలుగా ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు సర్పంచ్ గురువెల్లి కుమారి చేతుల మీదుగా నగదు పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వి బాల రామకృష్ణకు రూ.3 వేలు, కె.శశి ప్రవల్లికకు రూ .2 వేలు, కె.కావ్య, ఎస్‌కే హసీనా భానులకు రూ.1000 చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. కార్పొరేషన్ డైరెక్టర్ పొన్నాడ సింహాద్రి ,పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కొలాటి కాంతారావు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాడు రోడ్డుపై పడిగాపులు - నేడు డోర్ డెలివలీ



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొవ్వూరు పట్టణంలో వ్యాన్ ద్వారా రేషన్ సరుకుల డోర్ డెలివలీ



టీడీపీ హయాంలో కొవ్వూరు మసీదు వీధిలో రేషన్ కానుకల కోసం బారులు తీరిన జనం



టీడీపీ హయాంలో దొమ్మేరులో రేషన్ కోసం క్యూలో జనం పడిగాపులు (2015-ఫిబ్రవరి 2న తీసిన ఫొటో)

**రేషన్ డోర్ డెలివరీతో తప్పిన తిప్పలు**

కొవ్వూరు: తెలుగుదేశం పాలనలో రేషన్ కోసం ప్రజలు చౌకధరల దుకాణాల వద్ద ప్రజలు గంటల తరబడి పడిగాపులు పడాల్సి వచ్చేది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. రేషన్ సరుకుల కోసం పేదలు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా నేరుగా డోర్ డెలివలీ విధానాన్ని అమల్లోకి తెచ్చారు. ముందుగానే వలంటీర్ ద్వారా ఆయా ప్రాంతాల ప్రజలకు సమాచారం అందించి వ్యాన్ ద్వారా లబ్ధిదారుల ఇళ్ల చెంతకే వెళ్లి సరుకులు అందిస్తున్నారు. ఇదే రేషన్ కోసం టీడీపీ పాలనలో జనం అష్టకష్టాలు పడ్డారు. పై చిత్రంలో సంక్రాంతికి కానుకల పేరుతో ఇచ్చే సరుకుల కోసం జనం గంటల తరబడి బారులు తీరి నిలబడాల్సి వచ్చేది. మేజర్ పంచాయతీ అయిన మండలంలోని దొమ్మేరు గ్రామంలోని 2,893 రేషన్ కార్డులకు ఒకేఒక్క చౌకదుకాణం ఉండేది. దీంతో ఈ గ్రామస్తులు సరుకుల కోసం రోజుల తరబడి క్యూలైన్‌లో నిలబడాల్సి వచ్చేది. ప్రజలు ఆందోళనకు దిగడంతో ఈ దుకాణాన్ని విభజించి నాలుగు రేషన్ షాపులు ఏర్పాటు చేశారు. అదే రీతిలో కొవ్వూరు పట్టణంలో రేషన్ దుకాణంలో క్యూలో కిలో మీటరు దూరానికి పైగా ఉండేది. సరుకులు తీసుకుని లబ్ధిదారులు ఆపసోపాలు పడుతూ ఇళ్లకు మోసుకెళ్లాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రేషన్ డోర్ డెలివరీ విధానంలో ఇళ్ల చెంతకే పంపిస్తూ ప్రజా మన్ననలు పొందుతోంది.

## చాగల్లులో విద్యార్థులకు క్రీడా ఎంపిక పోటీలు

చాగల్లు: వైఎస్సార్ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి చాగల్లు జెడ్పీ హైస్కూల్ మైదానంలో సోమవారం మండల స్థాయిలో 4, 5వ తరగతుల విద్యార్థులకు ఎంపిక పోటీలు నిర్వహించారు. వాటిపై ఎంఈవో వి.ఖాదర్‌బాబు మాట్లాడుతూ 30, 800 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, విద్యార్థుల ఎత్తు, బరువులకు సంబంధించి పోటీలు నిర్వహించామన్నారు. స్థానిక అశోక్ నగర్ ప్రాథమిక పాఠశాల 4 వ తరగతి విద్యార్థి సీహెచ్ భరత్, ఊనగట్ల మండల పరిషత్ (మొయిన్) ప్రాథమిక పాఠశాల 4వ తరగతి విద్యార్థిని ఎం.అనుగ్రహితలు ఎంపికయ్యారని చెప్పారు. ఎంపీడీవో బి.రాంప్రసాద్ పోటీలను సందర్శించారు. హెచ్ఎం పి.వీర్రాజు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాజమహేంద్రవరంలో నిర్వహించే జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

## 'సురక్ష'తో సమస్యలకు పరిష్కారం

నిడదవోలు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజా సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారాలు చూపుతామని ఎంపీడీఓ పి.సామ్యేలు అన్నారు. ఈ కార్యక్రమంపై సమిశ్రగూడెం పంచాయతీ కార్యాలయంలో సోమవారం సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయం స్థాయిలో అర్హత గల ప్రజలకు సంక్షేమ పథకాలు అందలేదన్న ప్రసక్తే ఉండకూడదన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రకాశరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### హోం మంత్రిని కలిసిన డీపీవో



మంత్రి తానేటి వనితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీపీవో జాన సత్యనారాయణ

కొవ్వూరు: ఇటీవలే విధుల్లో చేరిన జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) జాన సత్యనారాయణ సోమవారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను మర్యాద పూర్వకంగా కలిశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. రాజమహేంద్రవరంలో డివిజనల్ పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న ఆయనకు డీపీవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. సమర్థవంతంగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని మంత్రి సూచించారు.

### రెండు కుటుంబాలకు మంత్రి వనిత పరామర్శ

కొవ్వూరు: దొమ్మేరు సొసైటీ డైరెక్టర్ వాడవెల్లి సత్య చంద్రశేఖర్ (బాబీ) కుటుంబాన్ని హోం మంత్రి తానేటి వనిత సోమవారం పరామర్శించారు. ఇటీవల బాబీ తల్లి వరలక్ష్మి గుండె పోటుతో మృతి చెందారు. ఈ క్రమంలో మంత్రి దొమ్మేరులోని బాబీ స్వగృహానికి వెళ్లి వరలక్ష్మి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాబీ కుటుంబ సభ్యులను తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అదే గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కనుమూరి సత్తిరాజును మంత్రి పరామర్శించారు. సత్తిరాజు తండ్రి సూర్యనారాయణరాజు సంవత్సరీకం సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, పలువురు పార్టీ నాయకులు మంత్రి వెంట ఉన్నారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు



నల్లజర్లలో అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న యువత

నల్లజర్ల: ఓ అనాథ మృతదేహానికి నల్లజర్ల యువత పూనుకుని సోమవారం అంత్యక్రియలు నిర్వహించింది. వివరాలిలా ఉన్నాయి. ముసుళ్ళగుంట గ్రామానికి చెందిన కర్పూరం కోదండరామయ్య (65) వికలాంగుడు. కుటుంబ సభ్యులు, బంధువులు ఉన్నా బాగోగులు చూడడం మానేశారు. దాంతో ఆ వికలాంగ వృద్ధుడు కొంతకాలం క్రితం నల్లజర్ల వచ్చి తెలిసిన వారిని డబ్బులు అడుగుతూ పొట్ట నింపుకుంటూ బస్టాండ్ వద్దే నిద్రపోయేవాడు. కొంతకాలంగా ఇదే జరుగుతోంది.సోమవారం తెల్లవారుజామున కోదండరామయ్య మృతి చెందాడు. స్థానికులు అతడి బంధువులకు సమాచారం అందించినప్పటికీ వారెవరూ స్పందించలేదు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకుడు, గ్రామ పెద్ద మద్దిపాటి ప్రసాద్, పల్లి సుబ్బారావు, మద్దు ప్రసాద్, మామిడి అశోక్, కంకటాల వెంకట్రాజు తదితరులు ఆ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు.

### 'స్పందన' కు 11 అర్జీలు

కొవ్వూరు: స్పందనలో వచ్చిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లిబాబు అన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి 11 వినతులు అందాయన్నారు. ప్రజలు ఏవైనా సమస్యలుంటే ఆయా తహసీల్దార్, గ్రామ,వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. భూమి తగదాలు పరిష్కరించాలని, పట్టాదారు పాసుపుస్తకం ఆన్‌లైన్ చేయమని ఆర్జీలు అందాయన్నారు. డీఎల్‌డీవో శాంతమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.